క్లుప్తంగా

లింగ వివక్ష చూపొద్దు



కావలి (జలదంకి): లింగ వివక్ష నేరమని, బాలబాలికలను సమానంగా చూడాలని డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి అన్నారు. కావలిలోని పాతూరు అంగన్‌వాడీ కేంద్రంలో డాక్టర్ రామ్‌సెంటర్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు లింగ వివక్ష, భ్రూణహత్యలు, రక్తహీనత, ఆరోగ్య పరిరక్షణ, తదితర అంశాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఐరన్, ఫోలిక్ సిరప్‌లను అందజేశారు. రామ్ సెంటర్ డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, లోక్ అదాలత్ సభ్యుడు మాల కొండారెడ్డి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఎన్‌పీసీఐ లింక్ తప్పనిసరి

ఆత్మకూరురూరల్: రైతులు వ్యవసాయశాఖకు సంబంధించిన సంక్షేమ పథకాలను పొందాలంటే తప్పనిసరిగా బ్యాంక్ ఖాతాకు ఎన్‌పీసీఐ లింకును చేయించుకోవాలని ఏఓ కిషోర్‌బాబు సూచించారు. అప్పారావుపాళెం సచివాలయం, బట్టేపాడు రైతుసేవా కేంద్రాలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండలంలో 210 మంది రైతులు బ్యాంకు ఖాతాకు ఎన్‌పీసీఐ లింక్ చేయించుకోకపోవడంతో ప్రభుత్వ పథకాలు వర్తించడం లేదన్నారు. రైతుల జాబితాను రైతుసేవా కేంద్రాల్లోని నోటీస్ బోర్డులో ఉంచామన్నారు. అందులోని రైతులు తమ సమీప పోస్టాఫీసుల్లో లేదా బ్యాంకుల్లో ఎన్‌పీసీఐ చేయించుకోవాలని సూచించారు. వీఏఏలు సంధ్య, శ్రీహర్ష, వీఆర్వో వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అన్నా.. అమ్మానాన్నను బాగా చూసుకో

- భార్య వేధింపులకు తట్టుకోలేక భర్త ఆత్మహత్య
- నా చావుకి భార్య, అత్త కారణమని సెల్ఫీ వీడియో పోస్టు
- భార్య, అత్తపై కేసు నమోదు



కంకు తేజేష్(ఫైల్)

చేజర్ల(సోమశిల): భార్య, అత్త వేధింపులకు తాళలేక ఓ ఆటో డ్రైవర్ 'అన్నా నేను వెళ్తున్నా..అమ్మానాన్నను బాగా చూసుకో'' అంటూ ఓ సెల్ఫీ వీడియోను పోస్టు చేసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన చేజర్ల మండలంలో చోటు చేసుకుంది. వివరాలు.. చేజర్ల మండలం కొట్టాలు గ్రామానికి చెందిన కంకు తేజేష్ (27), సరళ దంపతులు. తేజేష్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. తేజేష్ తల్లికి ఆరోగ్యం సరిగాలేదు. ఆమెకు వైద్య చేయించేందుకు భార్య, అత్త ఒప్పుకోకుండా సంపాదించే డబ్బు మీ వాళ్లకి ఖర్చుపెడితే మా పరిస్థితి ఏమిటంటూ నిత్యం ఏదోక కారణంతో వేధించసాగారు. దీంతో తేజేష్ తట్టుకోలేక ఆదివారం సాయంత్రం పుట్టుపల్లి సమీపంలో ఓ సెల్ఫీ వీడియోను రికార్డు చేసి బంధువులకు పంపి గడ్డి మందు తాగాడు. స్థానికులు ఆత్మకూరు ఆస్పత్రికి తరలించారు. అనంతరం నెల్లూరులోని జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. సెల్ఫీ వీడియో ఆధారంగా భార్య సరళ, అత్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుమలరావు తెలిపారు.

ఉపాధి లక్ష్యాలను సాధించాలి

సీతారామపురం : ఉపాధి లక్ష్యాలను సాధించాలని ఎంపీడీఓ సాయిప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో ఉపాధి హామీ పనుల పురోగతిపై ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. ఉపాధి పనులు కోరిన ప్రతి కుటుంబానికి వందరోజుల పనిని కల్పించాలని పని దినాలను పంచాయతీల వారీగా విభజించి ప్రతి ఫీల్డ్‌అసిస్టెంట్‌కు లక్ష్యాలను నిర్దేశించారు. ప్రతి గ్రామంలో లక్ష్యం మేరకు కూలీలకు విధిగా పనులు కల్పించాలన్నారు. ఏపీఓ శ్యామల పాల్గొన్నారు.

'భట్రాజులు అనడంపై క్షమాపణలు చెబుతున్నా'

కావలి (జలదంకి): ఇటీవల మీడియా సమావేశంలో ఎమ్మెల్యే అనుచర మీడియాకు చెందిన నలుగురిని భట్రాజులు అన్నందుకు ఆ సామాజిక వర్గానికి క్షమాపణలు చెబుతున్నానని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇకపై సదరు మీడియా వారిని ఆలీబాబా నలుగురు దొంగలుగా సంబోధిస్తానని తెలిపారు.

మొక్కజొన్న పరిశీలన

వింజమూరు(ఉదయగిరి) : వింజమూరు మండలం బుక్కాపురం, చింతలపాళెంలో మొక్కజొన్న పంటను వ్యవసాయాధికారులు బుధవారం పరిశీలించారు. కత్తెర పురుగును గుర్తించి నివారణకు వేపనూనె, ఇమామెక్టిన్ బెంజోయేట్‌ను పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. పొదలకూరు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త సురేఖదేవి, ఏఓ ఏ వాసు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలపై ఆరా

సోమశిల: అనంతసాగరం మండలం పడమటి కంభంపాడు గిరిజన కాలనీని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ బుధవారం సందర్శించారు. గిరిజనులను అడిగి కాలనీలోని సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలో అవసరమైన మౌలిక వసతుల కల్పనపై హౌసింగ్, విద్యుత్‌శాఖ అధికారులతో చర్చించారు. తొలుత గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరును పరిశీలించి సూచనలు చేశారు. ఆగస్టు 1న పెన్షన్ పంపిణీని ఏడు గంటలలోపు ప్రారంభించాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీఓ రామచంద్రయ్య ఉన్నారు.

మంత్రి ఆనం ఇలాకాలో గ్రావెల్ దందా

కొరిమెర్ల నుంచి రాత్రి వేళల్లో అక్రమంగా రవాణా

- లేఅవుట్లకు పెద్ద ఎత్తున తరలింపు
- జేబులు నింపుకొంటున్న టీడీపీ నాయకులు
- మామూళ్ల మత్తులో చోద్యం చూస్తున్న అధికారులు



సంగం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీడీపీ నాయకులు చెలరేగిపోతున్నారు. ఇసుక, గ్రావెల్‌తో పాటు విలువైన వృక్ష సంపదను అక్రమంగా తరలిస్తూ జేబులు నింపుకొంటున్నారు. ఆనంతోనే అభివృద్ధి అంటూ అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు ఏడాదిలోనే ఆయనతోనే అక్రమాలు సాధ్యమని ప్రజలు అనుకునే స్థాయికి దిగజారిపోయారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇలాకాలో గ్రావెల్ దందా జోరుగా సాగుతోంది. ఆనం అనుచరులు, టీడీపీ నాయకులే ఈ దందాకు బరితెగిస్తున్నారు. అర్ధరాత్రి వేళల్లో యంత్రాలు, టిప్పర్ల సాయంతో గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తూ లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుని జేబులు నింపుకొంటున్నారు. ఎవరైనా అడిగితే ఆనం రామనారాయణరెడ్డి సూచనలతోనే గ్రావెల్‌ను తరలిస్తున్నామని చెబుతున్నారని అధికార పార్టీ నేతలే గుసగుసలాడుతున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

నిన్నమొన్నటి వరకు ఇసుక, మట్టి, కోళ్ల వ్యర్థాలపై కన్నేసి దోచుకున్న టీడీపీ నాయకులు గ్రావెల్ దందాకు తెరతీశారు. గత నాలుగు రోజులుగా సంగం మండలం కొరిమెర్ల నుంచి రాత్రి వేళల్లో గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. అర్ధరాత్రి వేళల్లో మూడు జేసీబీలు, పది టిప్పర్లతో నిత్యం వంద టిప్పర్ల గ్రావెల్‌ను జెండాదిబ్బ వద్ద ఏర్పాటు చేస్తున్న లేఅవుట్‌కు తరలిస్తున్నారు. టిప్పర్ గ్రావెల్ రూ.6 వేల నుంచి రూ.7వేల వరకు ఉంది. గ్రావెల్ తరలింపునకు ప్రభుత్వానికి రాయల్టీ కింద నగదు చెల్లించాలి. అయితే టీడీపీ నేతలు ప్రతిరోజూ రూ.7లక్షలకుపైగా విలువైన గ్రావెల్‌ను అక్రమంగా తరలించి జేబులు నింపుకొంటూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు.



జెండాదిబ్బ లేఅవుట్‌లో డంప్ చేసిన గ్రావెల్

చోద్యం చూస్తున్న అధికారులు

సామాన్యులు ఎవరైనా తమ అవసరాల కోసం ట్రాక్టర్ మట్టిని తరలిస్తే వాలిపోయే పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు గ్రావెల్ అక్రమ రవాణా పెద్ద ఎత్తున జరుగుతున్నా చోద్యం చూస్తున్నారు. అర్ధరాత్రి వేళల్లో నెల్లూరు–ముంబై రహదారిపై రయ్‌రయ్ మంటూ టిప్పర్లు వెళ్తున్నా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. మామూళ్ల మత్తుతోనే అధికార యంత్రాంగం గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

> **అనుమతుల్లేకుండా తరలిస్తే చర్యలు**
>
> మండలంలోని కొరిమెర్ల నుంచి గ్రావెల్‌ను తరలిస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. గ్రావెల్ అవసరమైన వారు ఎవరైనా సరే మైనింగ్ అనుమతి తీసుకోవాలి. అనుమతి లేకుండా గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటాం. రెవెన్యూ అధికారులను కొరిమెర్లకు పంపించి పరిశీలిస్తాం.
>
> – సోమ్లానాయక్, తహసీల్దార్

జగనన్నకు అండగా నిలుద్దాం



మాట్లాడుతున్న మూలే వినయరెడ్డి

ఉదయగిరి: కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ శ్రేణులపై అక్రమ కేసులు బనాయిస్తూ ఇబ్బంది పెడుతున్న నేపథ్యంలో అందరూ జగనన్నకు అండగా నిలిచి మండలంలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసుకుందామని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సొసైటీ అధ్యక్షుడు మూలే వినయ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన కొత్తపల్లిలోని తన నివాసంలో పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలిపించుకునేందుకు ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు.

స్వామిత్వ సర్వేపై శిక్షణ



ఆత్మకూరురూరల్: వచ్చే నెల 1 నుంచి గ్రామస్థాయిలో ప్రారంభించనున్న స్వామిత్వ సర్వే ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులను గుర్తించాలని అధికారులు సూచించారు. ఆత్మకూరు డివిజన్ పరిధిలోని మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్‌లు, డిప్యూటీ ఎంపీడీఓలకు ఆత్మకూరు డిప్యూటీ ఎంపీడీఓ భువనేశ్వరి ఆధ్వర్యంలో స్వామిత్వపై బుధవారం శిక్షణ ఇచ్చారు. ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి చేసే స్వామిత్వ సర్వేలో ముందుగా గ్రామాల హద్దులను గుర్తించాలన్నారు. అనంతరం ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులను గుర్తించాలన్నారు. అనంతరం ప్రతి ఆస్తికి 18 అంకెలతో కూడిన డిజిటల్ కార్డులను యజమానులకు అందజేసి వారి ఆస్తులకు చట్టబద్ధత కల్పించాలన్నారు. నిర్వహించిన ఈకార్యక్రమంలో ఆయా మండలాల సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పోలీసుల అత్యుత్సాహం

- జగన్ పర్యటనకు వెళ్లొద్దని వైఎస్సార్‌సీపీ నాయకులకు నోటీసులు





కండ్లగుంటకు, అల్లారెడ్డికి నోటీసులు అందజేస్తున్న పోలీసులు

ఆత్మకూరు/ఆత్మకూరురూరల్/ దుత్తలూరు: పోలీసులు అత్యుత్సాహాన్ని కనబరుస్తున్నారు. కూటమి ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటనకు జనసునామీని అడ్డుకునేందుకు ఆంక్షలు విధిస్తున్నారు. జగన్ పర్యటనకు ఎవరూ వెళ్లరాదని, జనసమీకరణ చేయరాదని వైఎస్సార్‌సీపీ నాయకులకు బుధవారం నోటీసులు అందజేశారు. ఆత్మకూరుకు చెందిన నాయకులు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, మురగళ్లకు చెందిన నాయకుడు తోడేటి అశోక్, దుత్తలూరుకు చెందిన లీగల్ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కండ్లగుంట వెంకటరెడ్డి, అనారోగ్యంతో మంచంలో ఉన్న కావలిలోని 26వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వేమిరెడ్డి విజయకుమార్ రెడ్డికి తదితరులకు నోటీసులు అందజేశారు.

జగన్‌పై ప్రజాభిమానాన్ని ఎవరూ ఆపలేరు



మీడియాతో మాట్లాడుతున్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి (జలదంకి): జగనన్నపై ప్రజాభిమానాన్ని ఎవరూ ఆపలేరని, కూటమి ప్రభుత్వం పోలీసు యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకుని ఎన్ని ఆంక్షలు పెట్టినా ఆయన్ని చూసేందుకు లక్షలాది మంది తరలిరావడం ఖాయమని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన కావలిలోని తన నివాసంలో వైఎస్సార్‌సీపీ పట్టణ నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వానికి అభివృద్ధిపై దృష్టి లేదని, అక్రమ కేసులు, రెడ్‌బుక్ రాజ్యాంగం ద్వారా అరాచకపాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. నెల్లూరు జిల్లా ప్రశాంతతకు మారుపేరు అని, అలాంటి జిల్లాలో ఇప్పుడు అవినీతిపై వైఎస్సార్‌సీపీ నాయకులే కాదు ప్రజలు ప్రశ్నించినా భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై అక్రమ కేసులు పెడుతూ ఒక కేసులో బెయిల్ వచ్చేలోపు మరో కేసు అంటూ రెండు నెలల నుంచి మానసిక క్షోభకు గురిచేస్తున్నారన్నారు. నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి 200 మంది రౌడీమూకలతో దాడి చేయిస్తే ఎటువంటి కేసులు లేవన్నారు. కావలి నియోజకవర్గంలో ఇసుక, గ్రావెల్, మైనింగ్ మాఫియాకు కర్త, కర్మ, క్రియ అయిన ఎమ్మెల్యే కృష్ణారెడ్డి అండతో తెలుగుతమ్ముళ్లు ఏడాదిగా ఎలా దోచుకుంటున్నారో ప్రజలందరికీ తెలుసునన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.350 కోట్లతో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను నిర్మించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. ఫిషింగ్ హార్బర్‌కు సంబంధించిన కాంట్రాక్ట్‌ను కావలి ఎమ్మెల్యేకు ఇప్పించింది కూడా తానేనని, దానికి సాక్ష్యం ఆయనేనని తెలిపారు. కావలిని కాపు కాస్తా అంటున్న ఎమ్మెల్యేకు అభివృద్ధి పనులు గుర్తుకు రావడంలేదన్నారు. గ్రావెల్, ఇసుక, మైనింగ్ దందా, స్కామ్‌ల పేరిట ఎలా దోచుకోవాలో నేర్చుకుని అరాచక పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. గురువారం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటనకు వెళ్లడానికి అనుమతులు లేవని కావలిలో వైఎస్సార్‌సీపీ నాయకులకు పోలీసులు నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. తమ అభిమాన నాయకుడిని చూడనీయకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. గతంలో తమ ప్రభుత్వంలో చంద్రబాబు, లోకేశ్ పాదయాత్రలు చేసిన సమయంలో ఇలా చేస్తే వారు తిరిగేవారా అని ప్రశ్నించారు. ప్రజాబలం, 40 శాతం ఓట్లు ఉన్న మాజీ సీఎం వైఎస్ జగన్‌కు భద్రత కల్పించకుండా పోలీసులు ఆంక్షలు విధించడం దారుణమన్నారు. ఎన్ని ఆంక్షలు పెట్టినా జగన్‌ను చూసేందుకు వచ్చే జన సునామీని ఎవరూ ఆపలేరన్నారు. జగన్ పర్యటనను జయప్రదం చేయాలని నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలకు పిలుపునిచ్చారు. పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పందిటి కామరాజు, పట్టణాధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, రూరల్ అధ్యక్షుడు వాయిల తిరుపతి, నాయకులు కనమర్లపూడి వెంకటనారాయన, గంధం ప్రసన్నాంజనేయులు, కుందుర్తి కామయ్య, దామిశెట్టి సుధీర్‌నాయుడు, ఏగూరు పుల్లయ్య, కొండూరు శ్రీనివాసులు, ఇర్ల సురేష్, దయాకర్ రెడ్డి, పార్థు, వంశీ, రాజేష్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పర్యటనపై ఆంక్షలు సబబు కాదు



సీతారామపురం : మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటన నేపథ్యంలో పోలీసులు ఆంక్షలు విధించడం సబబు కాదని జిల్లా పార్టీ యూత్ వింగ్ జాయింట్ సెక్రటరీ పాలగిరి ముద్దు కృష్ణమరాజు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని పరామర్శించేందుకు వస్తున్న జగనన్న పర్యటనకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యర్తలు, అభిమానులు హాజరుకావద్దని ఆంక్షలు విధించడం శోచనీయమన్నారు. జగనన్నపై ప్రజాభిమానాన్ని ఆంక్షలతో అడ్డుకోలేరన్నారు.

వాడీగావేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ జీవీ రమణమ్మ



వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ కామాక్షయ్యనాయుడితో వాగ్వాదానికి దిగిన టీడీపీ కౌన్సిలర్ సూరా



సమస్యలపై మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ తిరుపతమ్మ

- రూ.36 కోట్లతో అభివృద్ధి పనులకు ఆమోదం

ఆత్మకూరు: మున్సిపల్ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశం వాడీగావేడిగా సాగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మున్సిపల్ పరిధిలోని 23 వార్డుల్లో రూ.36కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. తొలుత కమిషనర్ సీ గంగాధర్ నేతృత్వంలో కౌన్సిల్ సమావేశం అజెండాలో పొందుపరిచిన 60 అంశాలను ఆర్ఐ షాజహాన్ చదివి వినిపించారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ కామాక్షయ్యనాయుడు మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి సమావేశ మందిరం పేరు కనిపించకుండా బోర్డుపై ప్లాస్టిక్ షీట్‌తో మూసివేయడం సరికాదని, మరణించిన ప్రజాప్రతినిధులపై గౌరవప్రదంగా వ్యవహరించడం సభ్యత అని తన అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. దీంతో టీడీపీ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి జోక్యం చేసుకుని సమావేశం ప్రారంభంకాగానే ఇలా అభ్యంతరాలు తెలపడం ఏమిటని మాట్లాడడంతో ఇరువురి మధ్యన కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం టీడీపీ కౌన్సిలర్ షేక్ గౌస్‌బాషా మాట్లాడుతూ 2024 ఫిబ్రవరి, జూన్ మాసాల్లో జరిగిన కౌన్సిల్ సమావేశాల్లో వాయిదాపడిన అంశాలను ప్రస్తుత సమావేశం అజెండాలో చేర్చడం ఏమిటని ప్రశ్నించారు. నెల్లూరుపాళెం సెంటర్ నుంచి ఆత్మకూరుకు వచ్చే ప్రధాన రహదారి డివైడర్‌లో గ్రీనరీ కోసం 9 విభాగాలుగా రూ.45 లక్షలు ఖర్చు చేసినట్లుగా చూపడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. పూలమొక్కలు, డ్రిప్ ఇరిగేషన్‌కు ఇన్ని లక్షల రూపాయలను ఖర్చు చేశారని పలువురు సభ్యులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అనంతరం కొన్ని వార్డుల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులపై చర్చ జరిగింది. ముఖ్యమైన అభివృద్ధి పనులను పక్కనబెట్టి ఒకే ప్రాంగణంలో ఉన్న కూరగాయలు, చికెన్ మార్కెట్లలో విడివిడిగా పెయింటింగ్, ప్లంబింగ్ పనులు చేసేందుకు రూ.10 లక్షలు ఖర్చు చేయడం ఏమిటని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ తిరుపతమ్మ ప్రశ్నించారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన లిఫ్ట్ అంచనాలు అధికంగా ఉన్నాయని, వాటికి సంబంధించిన బిల్లులు చూపాలని కోరారు. కాగా తొలుత తిరుపతమ్మ సమస్యలపై మాట్లాడుతుండగా టీడీపీ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి అడ్డుకోబోగా కౌన్సిల్‌లో సభ్యులకు సమస్యలను ప్రస్తావించే హక్కు కూడా లేదా అని ఆమె ప్రశ్నించారు. అనంతరం మున్సిపల్ బస్టాండ్ సమీపంలోని వైఎస్సార్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాల లీజు గడువు పూర్తయిన క్రమంలో 33 శాతం అధికంగా లీజును పెంచే అంశాన్ని అజెండాలో పొందుపరచగా దుకాణాలు సక్రమంగా జరగడం లేదని, కొంత మేర తగ్గించాలని వ్యాపారులు అభ్యర్థిస్తున్నందున పరిశీలించాలని పలువురు కౌన్సిలర్లు కోరారు. వైస్‌చైర్మన్ షేక్ సర్దార్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో కుక్కలు, కోతుల సమస్య అధికంగా ఉందని, దీని విషయమై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన కమిషనర్ గంగా ప్రసాద్ త్వరలోనే కోతులను పట్టిస్తామన్నారు. వీధికుక్కల సంతాన నిరోధక ఆపరేషన్లు చేయిస్తున్నామని, ఈ ఏడాది ఇప్పటి వరకు 67 కుక్కలకు చేయించామని తెలిపారు. 7వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ నౌషాద్‌బేగం మాట్లాడుతూ ఎంజీఆర్ మున్సిపల్ బస్టాండ్ బస్టాండ్‌లోని దుకాణాలను లీజుకు ఇచ్చే క్రమంలో మహిళలు, గర్భిణిలు, బాలింతల కోసం కేటాయించారని, ప్రస్తుత కౌన్సిల్ సమావేశంలో దాని ప్రస్తావనే లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. మహిళలకు గౌరవం కల్పించేలా బస్టాండ్ కాంప్లెక్స్‌లో వారి కోసం గదిని కేటాయించాలని డిమాండ్ చేశారు. కాగా కౌన్సిల్ సమావేశానికి 8 మంది కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. మున్సిపల్ ఆర్‌ఐలు శ్రీనివాసులురెడ్డి, డీ మాధవి పాల్గొన్నారు.

రాజవోలు మాజీ సర్పంచ్ చిట్టమూరు మృతి



గోపాలకృష్ణారెడ్డి (ఫైల్)

అనుమసముద్రంపేట: రాజవోలు పంచాయతీ మాజీ సర్పంచ్ చిట్టమూరు గోపాలకృష్ణారెడ్డి(92) వయోభారంతో బుధవారం మృతి చెందారు. ఆయన రాజవోలు సర్పంచ్‌గా దాదాపు 30 ఏళ్లపాటు పనిచేశారు. జిల్లా రాజకీయ నాయకులతో సత్సంబంధాలు కలిగి పంచాయతీ అభివృద్ధికి ఎంతో కృషిచేశారు. ఆత్మకూరు డివిజన్ పరిధిలోనే మొట్టమొదటగా తాగునీటి ట్యాంక్‌ను రాజవోలులో నిర్మించారు. రామాలయం, పంచాయతీ భవన నిర్మాణాలు చేపట్టారు. చిట్టమూరు మృతికి పలువురు సంతాపం తెలిపారు. కాగా చిట్టమూరు అంత్యక్రియలను గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ఖాజీ నియామకంపై సమావేశం

సోమశిల: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అనంతసాగరంలో ఖాజీ నియామకంపై ముస్లిం మతపెద్దలు, మసీదు ముతవళి సమక్షంలో జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ షేక్ ఐఫా బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నెల్లూరు ప్రాంతానికి చెందిన షేక్ అహ్మద్ నెల్లూరు సిటీతో పాటు ఏడు మండలాలకు ఖాజీగా గత 21 ఏళ్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అనంతసాగరానికి సయ్యద్ తనీర్‌అహ్మద్ తనను ఖాజీగా నియమించాలని ఇటీవల కలెక్టర్, జిల్లా ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్‌కు విన్నవించుకున్నారు. ఈ క్రమంలో మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ మతపెద్దలతో సమావేశమై తనీర్‌అహ్మద్ నియామకంపై చర్చించారు. ఆయన ఖాజీ పోస్టుకు అన్ని విధాలా అర్హత కలిగి ఉన్నారని, స్థానికంగా ఉండే వ్యక్తిని నియమిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ ముస్లిం సమాజానికి సేవలు అందిస్తారని పలువురు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ మేరకు నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ తెలిపారు. తహసీల్దార్ జయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా -ఒకరికి తీవ్ర గాయాలు



శశికుమార్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

మర్రిపాదు: ఆటో అదుపుతప్పి బోల్తాపడడంతో డ్రైవర్ గాయపడిన ఘటన మండలంలోని పొంగూరుకండ్రిక వద్ద బుధవారం చోటు చేసుకుంది.వివరాలు.. ఆత్మకూరు నుంచి మర్రిపాడుకు ఖాళీ పాల క్యాన్లతో వెళ్తున్న ఆటో పొంగూరుకండ్రిక వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ శశికుమార్‌కు కాలు విరిగింది. ఆటోలోని మహిళలకు ఎలాంటి గాయాలు కాలేదు. క్షతగాత్రుడ్ని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

